# ఎదురు చూపు



అప్యాహ్నాతాప్రతివచనం
నదదాతి రుష్యత్యేకైకస్మిన్
ఆర్యా కార్యేణ వినా
ప్రదీప్యమానే నదీ కచ్ఛే

**భావం:** అమ్మాయిగారు పలకరించినా బదులివ్వడం లేదు. పని లేకపోయినప్పటికీ, పక్కన ఉన్న అడవి అంటుకున్నప్పటికీ నది ఒడ్డున కూర్చున్న ప్రతి మగవాడి మీదా కోపం చూపిస్తున్నది.

వీణకు పద్మసంభవుడితో వివాహం నిశ్చయమైంది. ఇరువైపుల పెద్దలూ శుభలేఖలు మార్చుకున్నారు.

వీణ అందకత్తె, సంగీత సాహిత్యాలలో పండితురాలు. పద్మసంభవుడు రాజోద్యోగి, ఆస్తిపరుడు. అన్నివిధాలా అందరికీ ఆనందకరమైన విషయం. వైశాఖంలో సంబంధం కుదుర్చుకున్నారు.

పానకంలో పుడకలా చిన్న సమస్య వచ్చింది. వీణా పద్మ సంభవులిద్దరూ జ్యేష్టులు. అందుకని జ్యేష్టంలో పెళ్ళి చెయ్యడానికి లేదు. ఆపైన ఆషాఢం, ఆ తర్వాత గురుమౌఢ్యం. అన్నీ అయ్యాక మాఘమాసందాకా ఆగడం పద్మసంభవుడి ఇష్టం లేదు. కానీ ఏమీ చెయ్యలేదు కదా.

కాబోయే భార్యతో సరదాగా విహారానికైనా వెళ్ళాలని అతనికి అనిపించింది.కాబట్టి ( ఈకాలంలో సినిమాకి రమ్మన్నట్లుగా) వీణను నదీ తీరానికి రమ్మని పిలిచాడు. వీణ తల్లిని అడిగింది.( ఇప్పటి తల్లులు వలెనే) వీణ తల్లి కూడా భయపడింది. నదీ తీర విహారంతో ఆగితే ఫరవాలేదు. ఆపైన ఏమైనా జరిగితే...

అమ్మాయి శీలమూ, ఇంటి పరువూ పోతాయి కదా. అలాగని అమ్మాయిని పంపకపోతే కాబోయే అల్లుడికి కోపం వస్తుందేమో. (ఇప్పటి తల్లులు చెల్లెల్నో, తమ్ముణ్ణోకూడా పంపినట్లుగా) ఆవిడ చెలికత్తెలతో సహా వీణను నదీ తీరానికి పంపింది.

వీణ నదీ తీరంలో పద్మ సంభవుడికై ఎదురుచూస్తోంది. దూరాన అడవి అంటుకుంది. కోయల గుడిసెలు కాలిపోతున్నాయి. మంటలు ఆర్పడానికై రాజోద్యోగులూ, సామాన్య ప్రజలూ పరిగెడుతున్నారు. వీణ నదీ తీరాన పద్మసంభవుడికై ఎదురుచూస్తూ, అడవిలోని మంటలను చూస్తోంది. ఆమెలో కోపం పెరిగిపోతోంది. తనను రమ్మన్నవాడు తనకన్నాముందు రావద్దా? తనే ఎదురు చూస్తూ కూచోవాలా? ఛీ మగవారంతా ఇంతే. ఆమెలో కోపం పెరిగిపోయింది.

చెలికత్తెలు" అమ్మాయిగారూ" అంటూ ఏదో చెప్పబోయారు. ఆమె బదులివ్వలేదు. మంటలార్పడానికి వెళ్ళేవాళ్ళనీ, మంటలకి భయపడి పారిపోయేవాళ్ళనీ, చోద్యంచూసే వాళ్ళనీ, ప్రతి మగవాడినీ ఏదో వంకనతిడుతోంది. చెలికత్తెలకేమీ అర్థం కావడం లేదు.

మంటలు అదుపులోకి వచ్చిన కొంతసేపటికి పద్మ సంభవుడు అలసిపోయిన ముఖంతో, నల్లగా కమిలిపోయిన శరీరంతో వచ్చాడు. రాజోద్యోగిగా మంటలార్పే పనిమీద అతను అడవికి వెళ్ళాడు. అందుకే ఆలస్యమైంది.

వీణ తప్పు తెలుసుకుంది. అఫీసునుంచి ఆలస్యంగా భర్త వచ్చినప్పుడు ఆడవాళ్ళ అలగరాదన్న హెచ్చరిక ఈ ప్రాచీన గాథలో నుండి నేటి స్త్రీలూ గమనించాలేమో.

******